నీ పెళ్ళెప్పుడు పాపా?

శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు

"నీ పెళ్ళెప్పుడు పాపా?" అనడిగాడు విశ్వపతి పదేళ్ళపిల్ల మణిని ఉద్దేశించి. మణిసిగ్గుపడి తలవంచుకున్నది.

మణి సిగ్గుపడితే చెక్కిళ్లు ఎర్రబారినయ్. కళ్లలో వింతకాంతి తొణికిసలాడింది. ముద్దులమూటగట్టే ఆ ముఖాన్ని చూసి ముగ్ధుడయాడు విశ్వపతి.

విశ్వపతికీ, రమామణికీ స్నేహం. విశ్వపతికి నలభయిఅయిదు ఏళ్లు. మణికి పదేళ్లు. అయినా రెండేళ్లనుంచీ వాళ్లిద్దరికీ ఎడతెగని స్నేహం.

విశ్వపతి వంటరిగాడు. అతనికి భార్యలేదు. అసలు అతను పెళ్లిచేసుకోలేదో లేక భార్యచనిపోయిందో ఎవరికీ తెలియదు. అతను మాత్రం వంటరిగానే జీవనం సాగిస్తున్నాడు. నౌఖరు కేశవులు మాత్రం అతన్నెప్పుడూ అంటిపెట్టుకుని వుంటాడు. ఈ లోకంలో అతనికి ఆత్మీయులంటూ ఎవరైనా వుంటే ఆ వ్యక్తి కేశవులేనేమో.

విశ్వపతి ఆ వూరు వచ్చి మూడు సంవత్సరాలయింది. అతను ఎవరికోసం బ్రతుకుతున్నాడో అతనికే తెలీదు. ఒక ఏడాది వేరే ప్రమేయంలేకుండా గడిపాడు. కాని ఆతర్వాతే యితనికో నూతన స్నేహితురాలు తటస్థపడింది.

ఒకరోజు ఉదయం అతను కాఫీత్రాగి సావిట్లో కూచుని పేపరు చూస్తున్నాడు. అప్రయత్నంగా అతను పేపరుమీదనుంచి దృష్టిమరలించుకుని వీధివైపు చూసేసరికి చేతిలో పుస్తకాలసంచీ పట్టుకుని చకచకా నడిచిపోతున్న ఎనిమిదేళ్ల అమ్మాయి కనిపించింది. విశ్వపతి ఒక్కసారిగా చకితుడయ్యాడు. ఆ అమ్మాయి పోయిన దిక్కువైపే చూస్తూవుండిపోయాడు. ఎందుచేతనో అతన్ని ఆకర్షించింది ఆ పిల్ల.

మరునాడు ఉదయం అదే వేళకు విశ్వపతి సావిట్లో కూచుని బయటకు చూస్తూ కూచున్నాడు. సరిగ్గా నిన్నటి వేళకే ఆ పిల్ల సంచి బుజాన తగిలించుకుని, గాలికిరేగుతున్న జుట్టును వెనక్కి ఎగదోసుకుంటూ పోతూ కనిపించింది.

"ఇటురా పాపా!" అని పిలిచాడు విశ్వపతి.

ఆ అమ్మాయి తటపటంగా చూస్తూ నిల్చుండిపోయింది. ఈ నూతనగంతకుడు తనను పిలిచే అవసరం ఏముందా? అని ఆలోచిస్తున్నట్లుంది.

"నిన్నే పాపా!" అని తిరిగి పిలిచాడు విశ్వపతి.

ఆ అమ్మాయి సంశయిస్తూ దగ్గరకువచ్చింది. విశ్వపతి ఆమెను తనదగ్గర కూచోపెట్టుకున్నాడు.

"నీ పేరేమిటమ్మా?"

"రమామణీ" అని చెప్పిందాపిల్ల.

"ఇటువేపు ఎక్కడకీ పోతున్నావు?" అనడిగాడు విశ్వపతి.

"బడికండీ. నేను మూడోక్లాసు చదువుతున్నాను!" అని జవాబు చెప్పింది మణి మరోసారి అడిగించుకోకుండానే.

"అలాగ అమ్మా. అయితేను యింతకుముందు ఎప్పుడూ కనిపించలేదేవమ్మా యిటువైపు పోతూనూ."

"నేనింతకుముందు యింకో బడిలో చదివేదాని నండీ. ఇప్పుడు అక్కడినుంచి యింకో బళ్ళోకి మారి పోయాను" అని చెప్పింది మణి.

తరువాత వాళ్ళ నాన్నగారు పేరూ అదీ అడిగి తెలుసుకున్నాడు విశ్వపతి. ఆయన పేరు రామారావుగారట. ఏదో ఆఫీసులో గుమస్తా పనిచేస్తు న్నాడట.

విశ్వపతి, కేశవుల్ని పిలిచి లోపలనుంచి రెండు కమలాఫలాలు తెప్పించి ఆమె సంచీలో పడ వేశాడు.

"వద్దండీ" అందిమణి. తన విషయంలో యితని కెందుకింత శ్రద్ధ ఆవహించిందా అని ఆశ్చర్యపడు తోంది ఆ పిల్ల.

"ఎందుచేత? "

"మీరెవరో నాకు తెలీదు. మా అమ్మ కోప్పడు తుందేమో"

విశ్వపతి నవ్వాడు. "పర్వాలేదులే పాపా, నేను నీ స్నేహితుడ్నేగా! ఇవేళనుంచీ నీకూ నాకూ స్నేహం. తెలిసిందా!" అన్నాడు.

ఆ పిల్ల ఆశ్చర్యంగా యితని ముహంలోకి చూసింది. అంత పెద్దమనిషికీ తనకూ స్నేహంఏమిటి లేకపోతే! అనుకుందేమో మనస్సులో.

"సరేనా" అన్నాడు విశ్వపతి.

"ఊఁ" అంది ఎలాగో.

తర్వాతమణి బడికివెళ్ళిపోయింది. విశ్వపతి ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు.

మరునాటినుంచీ రోజూ ఆవేళకు యిద్దరూ కలుసుకునేవారు. శని ఆదివారాలు వచ్చాయంటే విశ్వపతికి ప్రాణాంతకంగావుండేది. శని ఆదివారాలు రమామణికి బడివుండదు. రోజూ కలుసుకుని మాట్లాడటం అలవాటయిన విశ్వపతికి ఆటువంటప్పుడు ఏమితోచేదికాదు. అందుచేత "సెలవు రోజుల్లో కూడా వస్తూండుపాపా, నువ్వురాకపోతే నాకేమీ తోచదు" అని అంటూండేవాడు. మణి తలవూపేది కాని సెలవుల్లో ఎప్పుడో గాని వచ్చేదికాదు.

మణి, విశ్వపతిని బాబాయ్ అని పిలవటం అల వర్చుకుంది. రోజులు గడిచేకొద్దీ యిద్దరి మధ్యా చనువు అధికంకాసాగింది. విశ్వపతి ఆ పిల్లతో అనేక కబుర్లు చెప్పేవాడు. ఎన్నోప్రశ్నలు వేసేవాడు.

"మీయింట్లో నాగురించి చెప్పావాపాపా?" అనడిగాడు ఒకసారి.

"ఊఁ" అని తలవూపింది మణి.

"నాగురించి మీ అమ్మా నాన్నావాళ్ళు ఏమను కుంటారు?" అని ఆరాటంగా ప్రశ్నించాడు తిరిగి.

"మొదట నేను చెప్పినప్పుడు పెద్దవాళ్ళ స్నేహం చెయ్యకూడదు. వద్దు అన్నారు. కాని బాబాయ్ మంచివారు అని చెప్పాను. అప్పట్నుంచీ ఏమి అనటంలేదు." అని చెప్పింది మణి.

"నేనంటే నీకిష్టమేనా పాపా?" అనడిగాడు మరోసారి.

"ఊఁ" అంది ఆపిల్ల.

"ఎంత యిష్టం-చాలానా" అని ప్రశ్నించాడు ఉత్సుకంతో.

"చాలా" అంటూనవ్వింది మణి. విశ్వపతి సంతోషపరవశుడయిపోయాడు.

ఆ అమ్మాయి వచ్చినప్పుడల్లా ఏదో ఒకటి యిచ్చేవాడు. ఒకసారి బిస్కట్ల పొట్లం కొనిచ్చే వాడు. మరోసారి బొమ్మేదయినా తెచ్చి యిచ్చే

వాడు. ఏదో ఫలాలు యిస్తూండేవాడు అప్పుడప్పుడు "పిల్లలు కాఫీ తాగకూడదు. జబ్బు చేస్తుంది" అని చిక్కని పాలు కప్పుతో పోసి యిచ్చి త్రాగించేవాడు.

ఒక రోజున ఆ పిల్ల అడిగింది "మీరు నాకు రోజూ ఏదో ఒకటి యిస్తున్నారు కదా బాబాయీ! మీ డబ్బంతా అయిపోదూ?" అని.

"ఊహు. నాకు చాలా డబ్బువుంది." అన్నాడు విశ్వపతి.

"చాలా నా! అంటే?"

"అంటే లెక్కలేనంత. ఎంత ఖర్చు చేసినా యింకా వుంటూనే వుంటుంది" అని చెప్పాడు. చిన్న పిల్ల విస్తుపోయింది.

ఒక రోజు మణి చిరిగిన గౌను వేసుకుని వచ్చింది. విశ్వపతి ప్రాణం కొట్టుకుపోయింది. ఇటువంటిది వేసుకుని వచ్చావేం?" అని అడిగాడు ఆత్రంగా.

"చిరిగిపోయింది." అని చెప్పింది మణి అమాయకంగా.

ఆ సాయంత్రమే అతను పోయి రెండు రెడీమేడ్ గౌన్లు తీసుకున్నాడు ఖరీదులో. మరునాడు మణి వచ్చినప్పుడు ఆమె చేతికిచ్చాడు. మణి మురిసి పోయింది వాటిని చూసుకుని. ఆమె ముఖంలో సంతోషం చూసి యితను మురిసిపోయాడు.

మరునాడు మణి వచ్చినప్పుడు అడిగాడు "నిన్న యిచ్చినవి చూసి యింట్లో ఏమన్నార"ని

"పాపం ఎవరో పిల్లలు లేని వాడు కాబోలు" అన్నారని చెప్పింది మణి. విశ్వపతి ముఖంలో విషాదఛాయలు ఆవరించాయి.

అప్పుడప్పుడూ ఛలోక్తికి అంటూండేవాడు. "నీ పెళ్ళెప్పుడు పాపా?" అని. ఇది విని మణి సిగ్గులో మునిగిపోయేది. ఆ ప్రశ్న అడిగేటప్పుడు విశ్వపతి ముఖ కవళికలు కూడా అదో విధంగా మారి పోయేవి.

ఈ విధంగా వాళ్ల యిద్దరి స్నేహంతో చాలా రోజులు గడిచిపోయాయి.

♦ ♦ ♦

"నీకివాళో మంచి బహుమానం పాపా" అన్నాడు విశ్వపతి ఆ రోజు ఉదయం.

మణి ప్రశ్నార్థకంగా చూసింది.

"ఏమిటో చెప్పుకో" అన్నాడు విశ్వపతి తిరిగి.

మణి ఆలోచించింది. -"బిస్కెట్లా" అని అడిగింది.

"ఊహు"

"పిప్పరమెంట్లు"

"కాదు"

"బొమ్మలు"

"అబ్బే"

మణి ఆలోచించింది మళ్లీ. "ఊ. తెలిసి పోయింది" అంది కొంత సేపయింతర్వాత.

విశ్వపతి ఓడిపోయిన మొహం పెట్టాడు "ఏమిటి?"

"అమ్మా ఆశ. నేను చెప్పను" అంది మణి.

"నీకు తెలీదు. అబద్ధమాడుతున్నావు" అన్నాడు విశ్వపతి.

"కాదు తెలుసు. అయినా చెప్పను"

"అమ్మో గడుసుపిల్లవే" అంటూ జేబులోంచి ఒక అందమైన అట్టపెట్టె బైటికి తీశాడు. రమా

మణి ఆశ్చర్యంగా చూస్తూంది. విశ్వపతి ఆ పెట్టె తెరిచి అందులోంచి ఒక అందమైన బంగారపు గొలుసుని బయటకు తీశాడు. మణి తెల్లబోయింది.

"ఇదెవరికి ?"

"ఇంకెవరికి ? నీకే" అంటూ ఆ పిల్లమెళ్ళో తగిలించబోయాడు గొలుసును.

"అమ్మో. మా యింట్లో కోప్పడతారు. వద్దు బాబాయ్" అంది భయంగా మణి.

"ఎందుకు కోప్పడతారు పాపా? బాబాయ్ యిచ్చాడని చెప్పు"

అయినా మణి భయంపోలేదు. తనకా గొలుసు వద్దని చెప్పింది తిరిగి. విశ్వపతి ఒప్పుకోలేదు. ఎలాగయితేనే ఆ పిల్లను అంగీకరింపచేసి మెళ్ళో తగిలించాడు దాన్ని. తర్వాత కొంతసేపటికి "వెళ్తాను బాబాయ్" అని చెప్పి వెళ్ళిపోయింది మణి.

విశ్వపతి ఆలోచిస్తూ వుండిపోయాడు.

♦ ♦ ♦

మరునాడు మామూలు వేళకు విశ్వపతి సావిట్లో కూచుని రమామణికోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

బడిగంటకొట్టి పావుగంటయింది. పిల్లలందరూ యిందాకెప్పుడో వెళ్ళిపోయారు. బడివేళకు ఒక అరగంటయినా ముందువచ్చే మణి ఆనాడెందుచేతో యింకా రాలేదు.

విశ్వపతి అప్పటికింకా కాఫీకూడా తీసుకోలేదు. నిన్న యిచ్చిన గొలుసు విషయం యింట్లో ఏమన్నారో కనుక్కుందామని అతని ఆతురత. మణి రోజూవచ్చే వీధివైపు చూస్తూ చాలాసేపు కూచుండిపోయాడు.

"ఇంకా కాఫీ పుచ్చుకోలేదు బాబూ" అని జ్ఞాపకంచేశాడు కేశవులు యజమానివద్దకువచ్చి.

విశ్వపతి తలఎత్తిచూశాడు.

"ఇక్కడకు తీసుకురమ్మన్నారా బాబూ?"

"వద్దు. కొంచంసేపుండి త్రాగుతాను"

కేశవులు వెళ్ళిపోయాడు. విశ్వపతి యింకా ఎదురు చూస్తూనే వున్నాడు. మణి యివ్వాళింకా ఎందుచేతరాలేదు? ఎప్పుడూ యింత ఆలశ్యంచేసి ఎరగదే. అయితే ఎందుచేత యింత ఆలశ్యం? వాళ్ళింట్లో నిజంగా కోప్పడ్డారేమో! ఎవరు మాత్రం వూరుకుంటారు లేకపోతే. ఒక బంగారపు గొలుసు ఎవరో యిచ్చారని తెలిస్తే వాళ్ళకు అనుమానం కలక్కుండా ఎలా వుంటుంది? తనెవరో యింతవరకూ వాళ్ళకు తెలీదు. తను రోజూ ఏవేవో యిచ్చి పంపిస్తున్నా వాళ్ళు వూరుకున్నారు. కాని తను యిటువంటిపని చేసినందుకు యిక యీ విషయంలో వుపేక్ష చేస్తూ వూరుకోరు.

వాళ్ళది తిరిగి పంపించేస్తారేమో! మణిని తనతో మాట్లాడవద్దని శాసిస్తే?

విశ్వపతి హృదయం ఝల్లుమంది. తను అనవసరంగా యిటువంటిపని ఎందుకుచేశాడు? చేతులారా క్లిష్టపరిస్థితిని ఎందుకు తెచ్చుకున్నాడు?

ఆలోచిస్తున్న విశ్వపతి నిస్పృహపడ్డాడు. పోనీ యీ విషయం చెప్పటానికైనా, "మా యింట్లో యిది వద్దన్నారు" అని చెప్పటానికైనా మణి యిక్కడకి రావాలిగా. బడికిపోకుండా ఎందుకుంది? ఆమెకేమయినా అపాయం వాటిల్లలేదుకదా! అసలే యీ రోడ్డుమీద చాలా రద్దీగా వుంటుంది. కార్లూ, బళ్లూ ఎప్పుడూ విరామంలేకుండా తిరుగుతూనే వుంటాయి. చిన్నపిల్ల! పొరపాటున ...

ఛ ఛ, అయినా యిదేం ఆలోచన? యిన్నాళ్ళనుంచీ మణి సరిగ్గా రావటల్లేదూ? ఇంట్లో ఏద

యినా పని ఎక్కువవల్ల రాలేకపోయిందేమో. అంతే అయివుంటుంది అని సమాధానం చెప్పుకున్నాడు.

“కాఫీ చల్లారిపోతూంది బాబూ” అని తిరిగి జ్ఞాపకంచేశాడు కేశవులు.

“సరేపద. వస్తున్నాను” అంటూ భారంగా లేచి లోపలకు వెళ్ళాడు విశ్వపతి.

ఆ రోజంతా చాలా చిరాగ్గా గడిచింది విశ్వపతికి. మరునాడు ఉదయంకోసం కనిపెట్టుకు కూచున్నాడు అతను. మరురోజురాగానే మణిని ఎప్పుడు కలుద్దామా అని ఆవేదన.

ఆ రోజు గడిచిపోయింది. మరునాటి ఉదయం అదేవేళకు సావిట్లోకివచ్చి కూచున్నాడు విశ్వపతి.

నిన్నటిమాదిరిగానే బడిపిల్లలందరూ వెళ్లిపోతున్నారు. వాళ్ళందరివంకా తదేక దీక్షతో చూశాడు విశ్వపతి! ఊహు. మణి కనిపించలేదు. ఒకవేళ తనను తప్పించుకుపోదామన్న ఉద్దేశంతో చాటుగా పోతుందేమోననుకుని బడికిపోతున్న ప్రతి పిల్లనూ పరిశీలించిచూశాడు. ఏదీ మణి?

మణిని చూడాలి. ఏమయినాసరే. ఆ పిల్లను చూసి తీరాలి. చూడకుండా తనువుండలేడు. ఆ మణికేం సంభవించింది? రెండు రోజులు వరుసగా ఎందుకు రాలేదు?

ఆమె యింటికి వెడితే? అది బాగుంటుందా? తప్పేముంది? పోయి మణితలిదండ్రులతో తనను పరిచయంచేసుకుంటే వాళ్లేమీ అనుకోరు. మణికీతనకూ స్నేహం అని చెప్తే వాళ్లేమీ ఆటంకంచెప్పరు.

విశ్వపతి బయలుదేరాడు. మణియిల్లు అతను యింతవరకూ చూడకపోయినా ఎక్కడవున్నదీ తెలుసు. ఆ పిల్లను గుర్తులు అడిగితెలుసుకున్నాడు.

అయిదునిమిషాల్లో ఆ వీధిమలుపు తిరిగాడు. రామాలయం దగ్గర పెంకుటిల్లు అని చెప్పింది మణి. తను యిటువైపు ఎప్పుడో కాని రాడు. వెనకటికి ఒకసారివస్తే యిక్కడ రామాలయం చూసినట్లు గుర్తువున్నది.

విశ్వపతి మరోకొంతదూరం నడిచాడు. అదిగో! దూరంగా ఆలయం కనిపిస్తూంది! గబగబ అక్కడికి చేరుకున్నాడు. పెంకుటిల్లు! ఎక్కడ?

కాని అక్కడ ఒకటికాదు అటువంటి యిళ్లు వున్నవి; అయిదారువున్నాయి. తను ఎవరియింట్లోకి పోయి అడుగుతాడు? విశ్వపతి ఆలోచిస్తూ నిలుచుండి పోయాడు. అంతలోనే ఒక యింటితలుపు తెరుచుకుని ఒకాయన బైటికి వచ్చాడు. విశ్వపతి గబగబ ఆయన దగ్గరకుపోయి అడిగాడు “రామారావుగారి యిల్లు ఏదండీ?”

ఆ వ్యక్తి పోబోతున్నవాడల్లా ఆగి దానికి రెండిళ్ల అవతలనున్న పెంకుటిల్లు చూపించాడు. ఆయనకు కృతజ్ఞత చెప్పి ఆ యింటిని సమీపించాడు విశ్వపతి.

ఏమని పిలవాలి?

“రామారావుగారూ!” అన్నాడు మెల్లిగా.

ఎవరూ పలకలేదు. తడబడుతున్న చేతితో మెల్లిగా తలుపులు తోసిచూచాడు. దగ్గరగా వేసివున్నాయేమో అవి వెంటనే విడివడినై. విశ్వపతి లోపలకు తొంగిచూశాడు. మణి! మంచంమీద పడుకునివుంది. తల అటువైపు త్రిప్పివుంది. ఇక ఉపేక్ష చేయలేకపోయాడు విశ్వపతి. ముందూ వెనకా కూడా ఆలోచించకుండా లోపలకి మణి మంచందగ్గరకి పరిగెత్తాడు. మణి కళ్లుమూసుకుని పడుకునివుంది.

“మణీ!” అని పిలిచాడు మృదువుగా.

మణి పలుకలేదు. మంచంమీద కూర్చుని ఆమె వంటిమీద చెయ్యివేసి చూశాడు. సలసలకాగి పోతూంది.

(సశేషం)